వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- కార్యకర్తలు సైనికుల వలే పని చేయాలి
- 27న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి
- వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నేతల పిలుపు
- పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశాలు



మల్కాపురం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న బద్రినాథ్

మల్కాపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేసి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిని చేసే వరకు ప్రతి కార్యకర్త ఓ సైనికుడి వలే పని చేయాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదండి బద్రినాథ్ పిలుపునిచ్చారు. 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు ఆధ్వర్యంలో వార్డు స్థాయి క్యాడర్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా బద్రినాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్, టీడీపీ, జనసేన, వామపక్షాలు, బీజేపీ పార్టీలన్నీ ఒక్కటైనా.. జగనన్న వెంట తమలాంటి సైన్యం ఉందని, తమ ముందు ఆ పార్టీలన్నీ దిగదుడుపేనని చెప్పారు.

పొదుపు సంఘాలకు జగనన్న జీవం పోశారని, నాడు టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాలను విస్మరించిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆ సంఘాలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా, చేయూత ఇలా అనేక సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు అండగా నిలిచారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించిన ఘనత జగనన్నకు దక్కుతుందని చెప్పారు. నవరత్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు జగనన్నను మరిచిపోరన్నారు. ఈ నెల 27న జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేసి, వైఎస్సార్‌సీపీ బలం చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి సత్యనారాయణ, మూగి సూర్యనారాయణ, సోనూ, బాలు, మంగ, తదితరులు పాల్గొన్నారు.



59వ వార్డు పరిధిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పుర్రె సురేష్

- జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో వైఎస్ జగన్ గెలుపునకు అంతా శ్రమించాలన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు పెంటారావు, అమరావతి, సన్యాసిరావు, సంపత్, ఖాన్, తదితరులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 58వ వార్డులో జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు పాల్గొని క్యాడర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చుక్క వరలక్ష్మి, గొందేశి సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేద్దాం

సింధియా: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేద్దామని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 40వ వార్డులోని వైఎస్సార్‌సీపీ క్యాడర్ ముఖ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందన్నారు. కుల, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్న ఆడారి ఆనంద్ కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి, సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ నెల 27న శనివారం సీఎం జగన్ తలపెట్టిన ఎన్నికల శంఖారావం సభకు వార్డు నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వార్డు వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



40వ వార్డులో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

క్లుప్తంగా

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద ఈ నెల 26న పి.వి.ఎస్.హెల్పింగ్ హ్యాండ్స్ చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ చెప్పారు. రక్తదాన శిబిరం ఏర్పాట్లపై ఆయన మంగళవారం ట్రస్టు సభ్యులతో సమావేశం నిర్వహించారు. రిపబ్లిక్ డే రోజు ట్రస్టు స్థాపించానని, దీనిలో భాగంగా పదేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. బ్లడ్ బ్యాంక్ నిర్వహణలో తను అనేక రికార్డులు సొంతం చేసుకున్నామని వివరించారు. శుక్రవారం జరిగే రక్తదానం శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి,ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో పి.వి.ఎస్.హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టు ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత

విశాఖ విద్య: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన అనాథ శవాలకు మమత చారిటుబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అంత్యక్రియలు జరిపించారు. కేజీహెచ్‌లో చికిత్స కోసం చేరిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా వారిని తీసుకెళ్లేందుకు ఎవ్వరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది విషయాన్ని మమత చారిటబుల్ ట్రస్టు నిర్వాహకురాలు ఎల్లేటి మమతకు తెలిపారు. దీంతో ఆమె కేజీహెచ్ నుంచి ఆ శవాలను జ్ఞానాపురం శ్మశానవాటికు తరలించి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెను పలువురు అభినందించారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం



రూ.10 వేలు విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మూగి సూర్యనారాయణ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ-2 పరిధిలోని నూకాంబిక ఆలయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ నాయకుడు మూగి సూర్యనారాయణ రూ.10 వేలు విరాళం అందజేశారు. ఆలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఆలయ నిర్వహణ కమిటీ విన్నపం మేరకు తన వంతు సాయం అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సుసర్ల కాలనీ, ఎన్‌ఏడీ ఎస్సీ కాలనీ, ఇందిరా ప్రియదర్శిని, గాంధీనగర్, రెడ్డి వీధి, గవర వీధి ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖన పోటీలు

సింధియా: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చ కార్యక్రమంలో భాగంగా నౌ సేనా బాగ్‌లోని కేంద్రీయ విద్యాలయం-1లో విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మొత్తం 11 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఆరు అంశాలపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మంత్రాలు, చంద్రాయణం,భారతదేశ క్రీడల విజయం, వికసిత్‌భారత్, సుభాష్‌చంద్రబోస్, ఆదిత్య వంటి అంశాల్లో ఏదో ఒక అంశంపై డ్రాయింగ్ వేసే విధంగా పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సు. దీర్‌కుమార్, డ్రాయింగ్ టీచర్ సుసేంద్రరావు పోటీలను పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా ఆంధ్ర విశ్వ విద్యాలయం ఫైన్‌ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ నుంచి ముగ్గురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు. వారిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురిని ఎంపిక చేశారు.



తాము వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

విజేతలు వీరే..

అతిథిగుప్తా (ఎన్‌సీఎస్ స్కూల్), గణేష్‌చందు (కేవీ మల్కాపురం), ప్రియాంకబాయ్ (కేవీ-1 నౌసేనాబాగ్), మనీష్ (కేవీ స్టీల్‌ప్లాంట్), శ్రీచరణ్ (విజ్ఞాన్ ప్రతిభ ఉన్నత పాఠశాల) విద్యార్థులు ప్రతిభ చూపారు. న్యాయనిర్ణేతల చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

గెడ్డలో పూడిక తొలగింపు



గెడ్డలో పూడిక తొలగింపు పనులను పరిశీలిస్తున్న అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని గెడ్డలో మంగళవారం పూడిక తొలగించారు. ఆ వార్డు వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ ఈ పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికుల విజ్ఞప్తి మేరకు జీవీఎంసీ అధికారుల సహకారంతో పొక్లెయిన్‌తో పూడిక తొలగింపు పనులు చేపట్టామన్నారు.

నైతిక విలువలు బోధించే నాయకత్వం అవసరం

ఏయూ క్యాంపస్: నైతిక విలువలు బోధించే నాయకత్వం కోసం యువత ఎదురుచూస్తోందని ఏయూ న్యాయ కళాశాల పూర్వ ఆచార్యుడు, డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఏయూ గాంధీ అధ్యయన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గాంధీజీ-జాతీయ సమైక్యత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతీ పౌరుడు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. ముందుగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక అతిథి విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ సంఘర్షణలు పరిష్కరించడానికి గాంధీజీ ఆలోచనలు ఉపకరించే విధానాలు వివరించారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎం.శ్యామ్ ప్రసాద్, విశాఖ స్టీల్ ప్లాంట్ ఐఎన్‌టీయూసీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పి.కిషోర్‌కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న అతిథులు

ఐజీబీసీ స్టూడెంట్ చాప్టర్ ప్రారంభం



స్టూడెంట్ చాప్టర్ ప్రారంభిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) స్టూడెంట్ చాప్టర్‌ని మంగళవారం ప్రారంభించారు. ఆరో హరిత్ ప్రేమ్ భారత్ మహోత్సవ్ 2024లో భాగంగా 369వ విద్యార్థి శాఖను ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేశారు. గ్రీన్ బిల్డింగ్‌లపై యువతకు అవగాహన కల్పిస్తూ, వీటికి సంబంధించిన సమాచారాన్ని ఈ శాఖ అందిస్తుంది. ఐజీబీసీ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం చైర్మన్ లీలా ప్రసాద్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.కుమార్‌రాజ.. స్టూడెంట్ చాప్టర్ ప్రారంభోత్సవానికి సంబంధించిన ధ్రువ పత్రాలను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.ఐ.సత్యనారాయణరెడ్డి, ఐజీబీసీ సీనియర్ కౌన్సెలర్ శ్రీరేఖ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాముల వారి తీర్థం



ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తులు



అయోధ్య బాలరాముని చిత్రపటాలను భక్తులకు అందిస్తున్న ఆలయ కమిటీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ దొంకాడలో రాములవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాములను దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ అయోధ్య బాలరాముని చిత్ర పటాలను, ప్రసాదాన్ని అందజేసింది. సాయంత్రం సీతారాముల ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. జై శ్రీరామ్, శ్రీరామ.. జయ రామ.. జయ జయ రామ అంటూ భక్తులు జగదభిరాముని స్మరించారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు దాసరి త్రినాథ్, బొబ్బరి అప్పారావు, దాసరి సన్యాసిరావు, బల్ల సత్తిబాబు, దాసరి నాయుడు, కరణం పెంటారావు, సీహెచ్.దుర్గారావు, డి.శ్రీను, ఐ.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: గాజువాక మండల పరిధిలో ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం అందించాలన్న ఆలోచన ఉన్న ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్లు(న్యాయ సహాయకులు) గా పని చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గాజువాక మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జి.షణ్ముఖరావు ప్రకటనలో తెలిపారు. వీరికి శిక్షణ ఇస్తామని, ఏడాది పాటు సేవలు అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

వీరికి ఎటువంటి పారితోషికం చెల్లించబోమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31లోగా ఆధార్ కార్డు జిరాక్స్, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర సంబంధిత పత్రాలను గాజువాక కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కనీస విద్యార్హత పదో తరగతి అని, వివిధ సేవా సంస్థలలో పని చేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాలు

- ఓటర్లు పేర్లు పరిశీలించుకోవాలి
- ఆర్‌డీవో హుస్సేన్ సాహెబ్ విజ్ఞప్తి



మాట్లాడుతున్న హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటరు జాబితాలను ప్రదర్శనకు ఉంచామని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫైనల్ ఓటరు జాబితా ప్రకటించినట్టు చెప్పారు. వీటిని నియోజకవర్గంలోని 220 పోలింగ్ స్టేషన్లలో అందుబాటులో ఉంచేలా సచివాలయ సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఓటర్లు అంతా తమ ఓటు హక్కు ఉందో, లేదో అనే విషయాన్ని పరిశీలన చేసుకునేందుకు వీలుగా వీటిని ప్రదర్శనకు ఉంచాలన్నారు. అందరికీ ఈ విషయం తెలియజేసేలా మండల స్థాయి ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగంపై గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కల్పించేలా అధికారులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సమాచారం కావాలన్నా, సకాలంలో ఉన్నతాధికారులకు అందజేసేలా అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఓటరు జాబితా పరిశీలన అనంతరం ఎలాంటి సందేహాలు ఉన్నా, రాజకీయ పార్టీలు తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఏఈఆర్‌వోలు జయ, ఆర్జీవీ కృష్ణ, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్

మల్కాపురం: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ కీలక భూమిక పోషించారని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. బోస్ జయంతి సందర్భంగా మంగళవారం సెయింట్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అజాద్ హింద్ ఫౌజ్ అనే సైన్యాన్ని ఏర్పరచి స్వాతంత్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించారన్నారు. ప్రిన్సిపాల్ ప్రేమ మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ యువతకు స్ఫూర్తి అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి వై.అనసూయాదేవిని ప్రిన్సిపాల్ ప్రేమ,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి భాగ్యలక్ష్మి సత్కరించారు.



ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి అనసూయాదేవిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

సింధియా: డ్వాక్రా రుణమాఫీ, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నావడ్డీ, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక సహకారం అందిస్తూ మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డు పరిధి గుడివాడఅప్పన్నకాలనీ, దుర్గానగర్, ఎస్సార్‌కాలనీకి చెందిన డ్వాక్రా మహిళలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ సొమ్మును వైఎస్సార్ ఆసరా కింద సీఎం వైఎస్ జగన్ జమ చేశారని గుర్తు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు భారతి, సత్యనారాయణ, వార్డు సీనియర్ మహిళా నాయకురాలు మసేనమ్మ, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

రోడ్డు ప్రమాదంలో అత్తా కోడళ్లకు గాయాలు

గోపాలపట్నం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అత్తా కోడళ్లను ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు... చంద్రనగర్‌కు చెందిన అత్తాకోడళ్లు రాజేశ్వరి, రామలక్ష్మి ద్విచక్రవాహనంపై గురుద్వారా నుంచి చంద్రనగర్ వెళ్తున్నారు. ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద వెనుక నుంచి వస్తున్న కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఆటోలో క్షతగాత్రులను సమీప ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు మరో కారును ఢీకొట్టింది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం, రెండు కార్లు దెబ్బతిన్నాయి.



గాయపడిన అత్తా కోడళ్లు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అన్యాయం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని దీనిపై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1076వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్ఎంఎస్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. ఇన్ని రోజులుగా కార్మికులు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం పోరాడుతున్నా ప్రధాని నరేంద్రమోదీ ఈ విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును నష్టాల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



1076వ రోజు ఉక్కుదీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి ముఖద్వారం వద్ద మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది నెలలుగా ఏ నెలా సమయానికి జీతాలు చెల్లించలేదన్నారు. డిసెంబర్ నెల జీతం ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ జీతాలు ఎగ్గొట్టడంతో యాజమాన్యం రెండు, మూడు నెలలకు ఒకసారి జీతాలు చెల్లిస్తోందని చెప్పా రు. తక్షణమే జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం విభాగం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వి.వి.రమణ, ఎం.నర్సింగరావు, వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

సీతమ్మధార : ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటామని పీవోడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1027వ రోజు నిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. 32 మంది ప్రాణ త్యాగంతో ఉద్భవించిన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలంటే పోరాటమే శరణ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటలక్ష్మి, డీకేఎస్ రోహిణీదేవి, జిల్లా కార్యదర్శి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

25న సహస్ర తులసిపూజ.. : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.